ఆధ్యాత్మిక అమృతవాహిని

# శ్రీ రామకృష్ణ ప్రభ

మార్చి 2017

₹10



# లోపలి పేజీల్లో...


6 సంపాదకీయం
భక్తిరస భరితం... మహాప్రభు చరితం

8 గోరుముద్ద
సంస్కారానికే ప్రాధాన్యం

9 నిజమైన యోగం

10 పలికెడిది భాగవతం
విష్ణుపదంబు పొందుదువు...

12 మహాపురుషుని సాన్నిధ్య స్మృతులు

13 పారమార్థిక పథంలో...

14 రామకృష్ణ భక్తి సూత్రాలు

15 అన్నమయ్య పదామృతం
మాపులే మరణాలు రేపులే పుట్టుకలు

16 పరమపదానికి రాజమార్గం
ఆంతరిక శౌచం

18 తపించే మనసుకు తల్లి ఓదార్పు

20 భక్తుని మాటలు నిజం చేసిన భగవంతుడు

21 ధీరవాణి
మతమే మన జీవనరేఖ

22 ఉగాది జీవన పునాది

24 సంశయం నుంచి సంకల్పానికి...

25 కనిపించని కన్నీళ్ళు

26 వాస్తవంలో జీవిద్దాం

28 మనసున ఉన్నదీ...

30 మీకు తెలుసా?
ఆనంద రహస్యం

33 సేవాసంస్థల పాత్ర

35 ఒక కథ చెబుతా...
కీడు చేసిన వారికీ మేలు చేసేది...

36 భగవద్గీత - సద్గుణ సుధ
అంతరంగంలో ఋషిలా..
బహిరంగంలో రాజులా...

38 బొమ్మల కథ
కుమారిల భక్తి - వేదాల శక్తి


ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. - సంపాదకులు

## శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

* 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోగలరు.
* మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
* మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
* ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ... - సర్క్యులేషన్ మేనేజర్


KCP CEMENT
CONCRETE CEMENT
Since 1958

With Best Compliments From
CHAIRMAN & MANAGING DIRECTOR
THE KCP LIMITED
KCP కంపెనీ వారు "శ్రీరామకృష్ణ ప్రభ" మాసపత్రికను
1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు

KCP Sreshtaa CEMENT
THE NEW GENERATION CEMENT

Cement Marketing Division : Plot No. 10, Gayatri Hills, MP & MLA's Colony, Road No. 10 C, Jubilee Hills, HYDERABAD - 500033.
Tel : 040-2325 3503 to 505, Fax : 2325 3500, Cell : +91 99895 97775 / 9866305145, E-mail : ramakrishna.k@kcp.co.in
Registered Office : No. 2, Dr.P.V.Cherian Crescent, Egmore, CHENNAI - 600 008. Tel : 044 66772668, Fax: 044 66772620, CIN L65991TN1941PLC001128

సంపాదకీయం

# భక్తిరస భరితం... మహాప్రభు చరితం



భగవంతుడు ప్రసాదించిన మహాద్భుతవరం... ఈ మానవజన్మ. మనకు ఈ వరాన్ని ఒసగిన ఆ భగవంతుణ్ణి సాక్షాత్కరింపజేసుకోవడానికి ఓ అద్భుత పరికరం ఈ మానవ దేహం. అయితే, మనం భస్మాసురుడిలా మోహపరవశులమై ఈ వరాన్ని దుర్వినియోగపరచుకొని మనల్ని మనమే నాశనం చేసుకుంటున్నాం.

**భోగనిలయం కాదు... దైవనిలయం :** 'దేహో దేవాలయః ప్రోక్తః – దేహమే దేవాలయం' అని శాస్త్రాలు వక్కాణిస్తున్నాయి. కానీ మనం దైవనిలయమైన ఈ దేహాన్ని భోగనిలయంగా భావిస్తున్నాం. దేహంలోని ఇంద్రియాలను ప్రాపంచిక వ్యాపకాలకే పరిమితం చేస్తున్నాం. కానీ పారమార్థిక ప్రయోజనాలకు ఎంత వినియోగిస్తున్నామో ఆలోచించడం లేదు. కాబట్టి కళ్ళు, కాళ్ళు, చేతులు, చెవులు, నోరు... ఇలా అన్ని అవయవాలు సవ్యంగా ఉన్నప్పుడు, శక్తిమంతంగా పనిచేస్తున్నప్పుడు వాటిని సత్కర్మలు చేయడంలోనూ, సద్విషయాలు వినడంలోనూ, సద్వాక్కులు పలకడంలోనూ, సన్మార్గం అనుసరించడంలోనూ ఎంతవరకు సఫలీకృతులమవుతున్నామో అవలోకనం చేసుకోవాలి. అలా కానినాడు ఆ పరమాత్ముడు ప్రసాదించిన అమూల్యవరమైన ఈ మానవజన్మను దుర్వినియోగపరచుకొన్నవారమవుతాం. అద్భుత పరికరమైన ఈ మానవదేహాన్ని నిరుపయోగం చేసుకున్న వారమవుతాం. అందుకే భక్తప్రహ్లాదుడు భగవంతుణ్ణి తెలుసు కోవడానికి వినియోగించని ఈ దేహేంద్రియాలు కేవలం జడపదార్థాలతో సమానమని గుర్తుచేస్తూ...

**కంజాక్షునకు గాని కాయంబు కాయమే?**
**పవన గుంఫిత చర్మ భస్త్రిగాక!**
**వైకుంఠు బొగడని వక్త్రంబు వక్త్రమే?**
**ఢమ ఢమ ధ్వనితోడి ఢక్కగాక!**
**హరిపూజనములేని హస్తంబు హస్తమే?**
**తరుశాఖ నిర్మితదర్విగాక!**
**కమలేశు చూడని కన్నులు కన్నులే?**
**తనకుడ్యజాల రంధ్రములు గాక!**

“శ్రీహరిని సేవింపని శరీరం కేవలం గాలితో నిండిన కొలిమితిత్తి తప్ప, శరీరమవుతుందా? వైకుంఠవాసుని స్తుతింపని నోరు కేవలం ఢమ ఢమని ధ్వని చేసే ఢక్క అవుతుంది తప్ప, నోరు అవుతుందా? హరి పూజ చేయని చేయి కేవలం కర్రతో చేసిన తెడ్డు తప్ప, చేయి అవుతుందా? కమలేశుని చూడని కన్నులు కేవలం శరీరమనే గోడకున్న రంధ్రాలే తప్ప, కన్నులవుతాయా?” అని తెలిపాడు.

ప్రహ్లాదుడు విశ్లేషించిన ప్రకారం సరిపోల్చుకుంటే మన దేహేంద్రియాలు జడమైనవా? లేదా చైతన్యమంతమైనవా అన్న విషయం మనకు మనమే నిర్ధరించుకోవచ్చు. ఈ పద్యాన్నిగాని మనం ప్రతిరోజూ ఉదయాన ఒక్కసారి పఠించి, మననం చేసుకోగలిగితే దుష్కర్మలకు దూరంగా ఉంటాం, దురలవాట్లను దరిచేరనీయం. అప్పుడు అలజడులు, అల్లర్లు, అభిప్రాయ భేదాలు, వాగ్వివాదాలు, కోపతాపాలకు ఆస్కారమే ఉండదు. అల్పమైన ఈ జీవితకాలాన్ని సద్వినియోగపరచుకోవాలనే తపన నిరంతరం జ్వలిస్తూ ఉంటుంది. కానీ ఈ మాయామయ జగత్తులో, ఈ సమ్మోహనపూరిత సమాజంలో ఎంతటి వివేకులనైనా మాయామోహాలు ఆవరిస్తాయి, ఎంత అప్రమత్తంగా ఉన్నవారినైనా మానవజన్మ లక్ష్యాన్ని ఆదమరచేలా చేస్తాయి.

అందుకే మానవాళిని ఉద్ధరించడానికీ, మానవజన్మ పరమార్థాన్ని తెలియజేయడానికీ, మానవదేహం పరమ ప్రయోజనాన్ని గుర్తుచేయడానికీ ఆ పరమాత్ముడే మానవ రూపంలో అవతరిస్తూ ఉంటాడు. ఆ పరంపరలో భక్తిరసాన్ని భారతావనినంతా ప్రవహింపజేయడం కోసం, భగవన్నామామృతాన్ని సకల మానవాళికీ వితరణ చేయడం కోసం సాక్షాత్తూ ఆ కృష్ణపరమాత్మయే శ్రీచైతన్య మహాప్రభువుగా పశ్చిమబెంగాల్, నదియా జిల్లాలోని మాయాపూర్ గ్రామంలో 1486 ఫిబ్రవరి 18వ తేదీన ఆవిర్భవించాడు.

**మహాప్రభు భగవదున్మాదం :** ప్రహ్లాదుడు తెలియజేసినట్లు పరమాత్ముణ్ణి పొందడం కోసం వినియోగించని ఈ దేహేంద్రియాలు నిష్ప్రయోజనాలు, జడవస్తువులతో సమానమని విలపించిన మహాభక్తుడు శ్రీచైతన్య మహాప్రభువు. ఆయన శ్రీకృష్ణుని కోసం తపిస్తూ... “శ్రీకృష్ణుణ్ణి దర్శించడానికి ఉపయోగపడని నా దేహం, చిత్తం, సకలేంద్రియాలూ వ్యర్థం. శ్రీకృష్ణుని మధురవాణిని వినని నా చెవులు కేవలం కొండబిలములు. శ్రీకృష్ణుని మధురనామామృతాన్ని ఆస్వాదించని నా నాలుక కప్ప నాలుకతో సమానం. శ్రీకృష్ణుని దేహపరిమళాన్ని ఆఘ్రాణించని నా ముక్కు తోలుతిత్తితో సమానం. కోటి చంద్రుల చల్లదనాన్నిచ్చే శ్రీకృష్ణుని పాదాలను స్పృశించని నా చేతులు లోహంతో సమానం” అని విలపించేవారు.

చైతన్య మహాప్రభు శ్రీకృష్ణప్రేమోన్మాదంలో రేయింబవళ్ళూ గడిపేవారు. ఒక పున్నమి రాత్రి ఆయన ప్రేమావేశంలో పున్నమి

కాంతులతో మెరుస్తున్న సముద్ర తరంగాలను చూసి అవి యమునా నది తరంగాలని భావించి పరుగెత్తుకుంటూ వెళ్ళి సముద్రంలో పడిపోయారు. వలలో చిక్కుకున్న చైతన్యుణ్ణి ఒక బెస్తవాడు రక్షించాడు. అలాగే మరొకసారి చైతన్యుడు సముద్రాన్ని చూసి నీలవర్ణుడైన కృష్ణుడని తలచి సముద్రంలోకి నడుచుకుంటూ వెళ్ళిపోయారు. అది గమనించిన ఆయన శిష్యులు బయటకి తీసుకువచ్చారు. చైతన్య మహాప్రభు భక్తి ఉన్మాదం గురించి స్వామి వివేకానంద చెబుతూ... "చైతన్య మహాప్రభు గోపికలలాగ కృష్ణప్రేమోన్మత్తుడు. చైతన్యప్రేమభక్తి ప్రవాహంలో పండితులు, పామరులు; పవిత్రులు, పతితులు; ధనికులు, దీనులు; హిందువులు, ముస్లింలు అనే భేదం లేకుండా అందరూ తరించారు" అని శ్లాఘించారు.

**మహాప్రభు ప్రబోధం :** భగవద్భక్తిని పొందడానికి 'సత్సంగం, కృష్ణసేవ, ప్రతిమపూజ, భాగవతశ్రవణం, వ్రజసేవ (పుణ్యక్షేత్రాల సందర్శనం)' అనే ఐదు నియమాలను పాటించాలని చైతన్య మహాప్రభు బోధించారు.



అయితే, సదా సత్పురుషుల సాంగత్యంలో గడపడం, భగవత్ సేవాకార్య క్రమాలను చేయడం, భగవంతుని ఆరాధనలో నిమగ్నమవడం, భగవంతుని కథాశ్రవణంలో గడపడం, పుణ్యక్షేత్రాలను సందర్శించడం... ఈ నియమాలన్నీ ఆచరించడం కలియుగంలో అన్నగత ప్రాణులమైన మనకు సాధ్యమేనా? చంచల మనస్కులమైన మనకు సంభవమేనా? జీవనభృతి కోసం ఆరాటపడే మనకు సుగమమేనా? అనే సందేహాలు మన మనస్సులో వెల్లువెత్తుతాయి. అందుకే ఈ ఆధునికయుగంలో అన్నిటికన్నా ఆచరణీయం, సులభతరమైన మార్గం 'భగవన్నామస్మరణ' ఒక్కటే అని మహాప్రభు సూచించారు. అందుకే చైతన్య మహాప్రభు హరినామ సంకీర్తన చేస్తూ యావత్ భారతదేశం పర్యటించి మానవులకు హరినామామృతాన్ని చవిచూపారు. ఆయన 'హరి బోల్, హరి బోల్' అంటూ తన్మయంతో నృత్యం చేస్తూవుంటే ప్రజలంతా భక్తిపారవశ్యంతో నాట్యం చేసేవారు. అరణ్యమార్గం గుండా వెళుతూ కృష్ణనామ సంకీర్తన చేస్తూవుంటే పులులు, ఏనుగులతో సహా ఇతర జంతువులన్నీ ఆనందంతో నాట్యం చేసేవి.

చైతన్యులు భగవన్నామ సంకీర్తన మహత్వాన్ని వివరిస్తూ "ఈ కలియుగంలో హరినామాన్ని ఒక్కసారి నోటితో పలికినా, చెవులతో విన్నా, మనస్సులో చింతించినా తరిస్తారు. భగవద్భక్తిని పొందడానికి ముఖ్యంగా 'నామే రుచి' – భగవన్నామం పట్ల అభిరుచిని ఏర్పరచుకుంటే చాలు" అని ప్రబోధించారు.

శ్రీరామకృష్ణులు కూడా ఒక భక్తుడు వచ్చి తనకు భగవన్నామం పట్ల అభిరుచి కలగడం లేదని అన్నప్పుడు ఆయన అందుకు సమాధానంగా 'ఓ భగవాన్! నీ నామంపై నాకు అభిరుచికలిగేలా అనుగ్రహించమని ప్రార్థించు' అని సూచించారు.

**పారమార్థిక జీవన పరాకాష్ఠ :** చైతన్య మహాప్రభు భగవన్నామం పట్ల అభిరుచి కలిగిన భక్తుడు ఎలాంటి లక్షణాలు కలిగివుండాలో సూచిస్తూ...

**తృణాదపి సునీచేన తరోరివ సహిష్ణునా ।**
**అమానినా మానదేన కీర్తనీయః సదా హరిః॥** *(శ్రీ చైతన్య శిక్షాష్టకమ్)*

'తాను గడ్డిపోచకన్నా తక్కువ అనే భావం కలవాడు, వృక్షం లాగ ఓర్పు కలవాడు, డంబం లేనివాడు, కపటం లేనివాడు హరిని కీర్తించుటకు యోగ్యుడు' అని తెలిపారు.

గడ్డిపోచలా ఉండడమంటే దీనంగా, నిస్సహాయంగా ఉండడమని కాదు. గడ్డి ఒక వ్యక్తి కాలి కింద నలిగినా ఎలాంటి ఫిర్యాదు లేకుండా, ఎవరినీ నిందించ కుండా మరలా యథాస్థితికి వస్తుంది. అలాగే, నిజమైన భక్తుడు ఎలాంటి అవమానాలు ఎదురైనా క్రుంగిపోకుండా దృఢచిత్తంతో ఉండగలగాలి. చెట్టు ఎన్ని గొడ్డలి దెబ్బలకు గురైనా సహనం వహిస్తుంది, పైగా తనను కొట్టేవాడికి నీడనిస్తుంది. అలాగే, నిజమైన భక్తుడు ఇతరులు కష్టాలు కలిగించినా భరించి, వారిపట్ల ఎలాంటి ప్రతీకారభావం లేకుండా వ్యవహరించగలగాలి. అలాగే, తనను తాను పొగుడుకోనివాడు, ఇతరులను నిందించనివాడు నిజమైన భక్తుడు. చైతన్యుడు ప్రబోధించిన ఈ లక్షణాలను అలవరచుకున్నప్పుడే భగవన్నామస్మరణ ఫలితం సంపూర్ణంగా లభించినట్లు, పారమార్థిక జీవన పరాకాష్ఠను సాధించినట్లు లెక్క!

అలాగే, వ్యావహారిక జీవితంలో కూడా భగవన్నామస్మరణ, ప్రార్థనల వల్ల దీర్ఘకాల వ్యాధులు, ప్రాణాంతకమైన వ్యాధులు నయమవడం; క్లిష్టమైన శస్త్రచికిత్సల తరువాత అనూహ్యంగా కోలుకోవడం; ఒత్తిడి, ఆందోళన, భయం లాంటి మానసిక రుగ్మతలు సమసిపోవడం... ఇలా ఎన్నో అద్భుతాలు జరుగు తున్నట్లు ఆధునిక వైద్యశాస్త్ర పరిశోధనలో తేలింది. కాబట్టి ఈ ఆధునిక కాలంలో భగవన్నామస్మరణ శారీరక, మానసిక రుగ్మతలకు కూడా పరమ ఔషధమని గ్రహించి భగవన్నామస్మరణ, ప్రార్థనలను నిత్యం అభ్యసించడం మన దినచర్యలో ఒక భాగంగా చేసుకోవాలి. ఆ మహాప్రభు ప్రవహింపజేసిన భక్తిరసవాహినిలో మునిగి మన భవతాపాన్ని ఉపశమింపజేసుకోవడానికి ప్రయత్నించాలి. ❖

**చైతన్యుడు ఏ వనాన్ని చూసినా అది బృందావనమని భావించేవాడు. ఆయనలో దివ్యప్రేమ పరిపూర్ణమై ఉండడమే కాకుండా, ఆయన హృదయం నుండి పొంగి ప్రవహించేది.** - *శ్రీరామకృష్ణులు*

# గోరుముద్ద - స్వామి సుప్రియానంద

# సంస్కారానికే ప్రాధాన్యం

ఓ భక్తుడు ఇటీవల ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా బదిలీపై జపాన్‌కు వెళ్ళాడు. కొన్ని నెలల తరువాత సెలవులపై మన దేశానికి వచ్చి తన ఎనిమిదేళ్ళ కొడుకు చదువు గురించి కలవరపడసాగాడు. 'అదేంటి! మీ అబ్బాయి తెలివైన వాడే కదా! గణితం నుంచి కంప్యూటర్స్ వరకు అన్నింట్లో మీవాడికేగా మొదటి మార్కులు' అన్నాను. అప్పుడు ఆ భక్తుడు ఉదాసీనంగా 'కానీ ఏం లాభం స్వామీజీ! మావాడిని జపాన్‌లో ఏ పాఠశాలలోనూ చేర్చుకోవడం



లేదు' అన్నాడు. 'ఎందుకు? అక్కడ పెట్టిన పరీక్షల్లో మీ బాబు నెగ్గటం లేదా? వారి ప్రమాణాలకు మీవాడు సరిపోవడం లేదా?' అని ఆశ్చర్యంగా అడిగాను. “వాళ్ళు పెట్టే పరీక్షలు పాఠాలపై కాదు ప్రవర్తనపై; వాళ్ళు చూసేది నాలెడ్జి కాదు నడవడిక! మావాడికేమో విషయపరిజ్ఞానం పుష్కలంగా ఉంది కానీ ఏం లాభం, వినయమే లేదు. పాఠాలు ఎన్నైనా వల్లె వేస్తాడు, కంఠస్థం చేస్తాడు, కానీ పక్క పిల్లలతో ఎలా మసలుకోవాలో తెలియదు, పెద్దలతో ఎలా మాట్లాడాలో తెలియదు. అందుకే 'సంస్కారమే లేకపోతే చదువెలా వస్తుంది?' అంటూ ఆ దేశంలో ఏ పాఠశాలలోనూ చేర్చుకోవడం లేదు” అన్నాడు. ఆ తరువాత జపాన్ విద్యావ్యవస్థ గురించి ఆయన చెప్పిన విషయాలు విని ఆనందాశ్చర్యాలు కలిగాయి. దాదాపు నూటా ఇరవై ఏళ్ళ క్రితం స్వామి వివేకానంద నినదించిన '*We want that education by which character is formed, strength of mind is increased...* శీలసంపదను, మనోబలాన్ని పెంచే విద్య మనకు కావలసింది!' అన్న ధీర వచనాలను అక్షరాలా ఆచరణలో పెడుతున్నారనిపించింది.

ఆ దేశంలోని అన్ని పాఠశాలల్లో నాల్గవ తరగతి వరకు పిల్లలకు పాఠాలు, పరీక్షలు అన్న ప్రసక్తే ఉండదట. అన్నేళ్ళూ ఉపాధ్యాయులు కేవలం చిన్నారుల నడవడిక పైనే దృష్టిపెడతారట! వారి ప్రవర్తనను ఎప్పటికప్పుడు సరిదిద్దుతూ, సంస్కారానికి పునాదులు వేస్తారని ఆయన చెప్పినప్పుడు అక్కడి విద్యావ్యవస్థపై గౌరవం పెరిగింది. పదేళ్ళలోపు ప్రాయంలో విద్యార్థుల మనసులలో సంస్కార బీజాలు పడితే బలంగా నాటుకుంటాయని జపాన్ సామాజిక నిపుణులు, విద్యావేత్తలు గుర్తించి విద్యావ్యవస్థలో ఆ విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకోవడం అభినందనీయం.

నిజానికి పాఠాలు, పరీక్షలు ఆ వయస్సులో అంత ప్రాముఖ్యమే కాదు. కానీ మంచి లక్షణాలు మొగ్గ తొడగాల్సిన పసి వయస్సులో వాళ్ళ మెదళ్ళలో సమాచారాన్ని కుక్కుతూ మనం ఎంత తప్పు చేస్తున్నామో అర్థం చేసుకోవాలి. బాల్యాన్ని అంత ఆరోగ్యకరమైన వాతావరణంలో తీర్చిదిద్దుతున్నారు గనుకనే జపనీయులు క్రమశిక్షణకు, దేశభక్తికి పెట్టింది పేరు.

అందుకే స్వామి వివేకానంద ఆ దేశంలో పర్యటించినప్పుడు జపనీయుల వ్యవహారశైలికి ముగ్ధులై “ఈ దేశాన్ని, ప్రజల్ని చూస్తే ముచ్చటేస్తుంది. ఎదుటివారితో ఎలా మసలుకోవాలో, మర్యాదమన్ననలను ఎలా పాటించాలో వీళ్ళను చూసి నేర్చుకోవాలి. మన దేశ పౌరులు ఒక్కసారైనా జపాన్‌ను సందర్శించాలి” అని అభిప్రాయపడ్డారు.

ఆనాడే కాదు ఈనాడు కూడా ఆ మాటలు అక్షరసత్యాలనడానికి, అసలు ఆ దేశపౌరులు అలా తీర్చిదిద్దబడటానికి అక్కడి పాఠశాలలే నిదర్శనమని అవగతమవుతోంది. మంచి ఎక్కడున్నా నేర్చుకోవాలన్న నానుడిని అనుసరించి, మనం, మన విద్యావేత్తలు కూడా అక్కడి నుంచి పాఠాలు నేర్చుకుంటే, రేపటిపౌరులు జాతిరత్నాల్లా వెలుగుతారు. ❖



# నిజమైన యోగం

– బ్రహ్మచారి శ్యామ్

దృఢమైన విశ్వాసం లేనిదే ఆధ్యాత్మికమార్గంలో పురోభివృద్ధి సాధ్యంకాదని శాస్త్రాలు ప్రబోధిస్తున్నాయి. అటువంటి విశ్వాసం కుదురుకోవాలంటే పరిశీలించడం, పరీక్షించడం ఎంతో ముఖ్యం. ఒక సాధువును అనుసరించే ముందు రేయింబవళ్ళు అతని జీవితాన్ని పరీక్షించడం, అతని బోధనలు, ఉపదేశాలు ఆచరణలో పెట్టి ఫలితాలను పరిశీలించడం–ఈ రెండూ చేస్తే చెదరని విశ్వాసం ఏర్పడుతుంది. అనుభవపూర్వకమైన జ్ఞానం కొండంత అండగా నిలుస్తుంది.

భగవాన్ శ్రీరామకృష్ణులు ఈశ్వరకోటికి చెందినవారిగా పేర్కొన్న తమ ఆరుగురు శిష్యులలో యోగీంద్రనాథ్ (స్వామి యోగానంద) ఒకరు. ఈశ్వరకోటి అంటే భగవంతుణ్ణి పోలి ఉండి కర్మబంధాలలో చిక్కుకోని స్వేచ్ఛాజీవి. ఇటువంటివారు ఇచ్ఛామాత్రంగా లోకహితం కొరకు ఇలలో అవతరిస్తారు.

నేటి యువతరంలో చాలామంది ఆధ్యాత్మిక సాధనల పట్ల స్పష్టమైన అవగాహన కొరవడటంవల్ల కఠినమైన, లోపభూయిష్ఠమైన మార్గాలను అనుసరించి కష్టాల పాలవుతున్నారు. ఇందుకు కారణం పరంపరగా వచ్చే ఉపనయనాది షోడశ సంస్కారాలలో విశ్వాసం లేకపోవడమే. ఉపనయన సంస్కారంలో తండ్రి నుండి స్వీకరించే మంత్రంగానీ, లేదా సద్గురువువద్ద బ్రహ్మోపదేశం ద్వారా స్వీకరించే మంత్రంగానీ ఆలంబనగా తీసుకొని సాధనచేస్తే అది ఆధ్యాత్మిక పురోభివృద్ధికి దారితీస్తుంది, బ్రహ్మచర్యవ్రతంలో సుప్రతిష్ఠులనుచేసి ఇహపర సుఖాలను కలుగజేస్తుంది.

సద్బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన యోగీంద్రుడు (స్వామి యోగానంద) దక్షిణేశ్వరంలో నివసించేవాడు. భగవాన్ శ్రీరామకృష్ణుల సాధనాక్షేత్రమైన దక్షిణేశ్వరంలోని పంచవటివద్ద నారాయణ్ అనే హఠయోగి నేతి–ధౌతి అనే యోగక్రియలు (పొడవైన దారంతో నాసికా రంధ్రాలను శుభ్రం చేయడం – నేతి క్రియ; లీటర్లకొద్దీ నీరు త్రాగి తిరిగి వమనం చేయడం – జలధౌతి క్రియ) ఆచరిస్తూ జనాన్ని ఆకర్షించేవాడు. ఈ యోగక్రియలు అంతరంగ అవయవాలను పరిశుద్ధంగా ఉంచి శరీరాన్ని దృఢంగా సాధనకు అనుకూలంగా ఉంచుతాయని వారి విశ్వాసం. భగవత్సాక్షాత్కారం పొందడానికీ, కామభావనలు తొలగించుకోవడానికీ ఈ హఠయోగసాధనలు అభ్యసించడం వినా మరో మార్గం లేదనుకున్నాడు యోగీంద్రుడు.

అయితే అప్పటికే శ్రీరామకృష్ణుల వద్దకు వస్తున్న యోగీంద్రుడు ఒకరోజు ఏకాంతంలో 'అయ్యా! ఈ కామప్రేరిత ఆలోచనల నుండి బయటపడటం ఎలా?' అని గురుదేవులను ప్రశ్నించాడు. 'హరినామస్మరణ చెయ్యి, ఆ ఆలోచనలు పోతాయి' అని శ్రీరామకృష్ణులు సమాధానమిచ్చారు. అయితే ఇంత సులువైన పరిష్కారంతో యోగీంద్రుడు సమాధానపడలేదు. పైగా శ్రీరామకృష్ణులకు ఆచరణాత్మక పద్ధతి ఏదీ తెలియదని, అందుకే ఏదో ఒక సమాధానం చెప్పి దాటవేసారని అనుకున్నాడు. 'ఎంతో మంది హరినామస్మరణ చేస్తున్నారు. మరి వారందరిలో కామం ఎందుకు తొలగిపోవడం లేద'ని సందేహించాడు.

అందుకే మరుసటిరోజు యోగీంద్రుడు నేరుగా హఠయోగి వద్దకు వెళ్ళి అతడు చెప్పేది శ్రద్ధగా ఆలకిస్తున్నాడు. శ్రీరామకృష్ణులు అక్కడకు వెళ్ళి అతని చేయి పుచ్చుకొని తన గదికి తీసుకువచ్చి 'నువ్వు హఠయోగ సాధనలు చేస్తే నీ మనస్సు ఎల్లప్పుడూ శరీరం గురించే ఆలోచిస్తూ ఉంటుంది. దానికి భగవంతుణ్ణి గురించిన నిజమైన ఆర్తి ఎన్నటికీ కలుగదు' అని ఉద్బోధ చేశారు.

అప్పుడిక ఆలోచించడం మొదలుపెట్టిన యోగీంద్రుడు 'సరే, గురుదేవులు చెప్పినట్లు చేసి ఫలితాన్ని ఎందుకు పరీక్షించకూడదు?' అనుకున్నాడు. ఏకాగ్రచిత్తంతో, త్రికరణశుద్ధిగా హరినామస్మరణ చేశాడు. అనతికాలంలోనే ఆశించిన ఫలితం ప్రత్యక్షంగా అనుభవంలోకి వచ్చింది.

తదనంతరకాలంలో స్వామి వివేకానంద 'మా అందరిలో పరిపూర్ణంగా కామంపై అద్భుత విజయం సాధించినవారు యోగీంద్రుడే' అని ప్రశంసించారు. ❖

(తిథి ప్రకారం మార్చి 16వ తేదీన శ్రీరామకృష్ణ పరమహంస సన్న్యాస శిష్యులైన స్వామి యోగానంద మహరాజ్ జయంతి)

భగవన్నామాన్ని విన్నంత మాత్రాన ఆనందభాష్పాలు స్రవిస్తూ, ఎవడి హృదయం ఉప్పొంగుతుందో అలాంటివాడు ఎలాంటి సాధనలూ చేయనవసరం లేదు. – శ్రీరామకృష్ణులు

పలికెడిది భాగవతం

# విష్ణుపదంబు పొందుదువు...



– స్వామి జ్ఞానదానంద

తపోఫలంతో రాజ్యానికి తిరిగి వచ్చిన ధ్రువుడిని ఆలింగనం చేసుకొని తండ్రి ఉత్తానపాదుడు, తల్లి సునీతి తన్మయులయ్యారు. పినతల్లి సురుచి తను చేసిన పరాభవానికి పశ్చాత్తాపంతో కుమిలిపోయింది. కానీ చిన్నవాడైనా ధ్రువుడు పెద్ద మనస్సుతో చిన్నమ్మ చరణాలకు అభివందనం చేశాడు. తమ్ముడు ఉత్తముడిని ఆత్మీయంగా అక్కున చేర్చుకున్నాడు. పురజనులు ధ్రువుడి ఘనతకు పులకించిపోయారు; ఉత్సాహంతో ఉత్సవాలు జరుపుకున్నారు. రాజర్షియైన ఉత్తానపాదుడు అద్భుతమైన కొడుకు ప్రభావానికి అబ్బురపడ్డాడు. ధ్రువుడికి ప్రజలపై గల అనురాగానికీ, ఆ ప్రజలకు ధ్రువుడిపై గల అభిమానానికీ ఆనందపడ్డాడు. అతణ్ణి రాజ్యానికి పట్టాభిషిక్తుణ్ణి చేసి, సుగతిని పొందడానికి తపోవనానికి తరలిపోయాడు. యుక్తవయస్సుకు రాగానే ఆ భక్తశిఖామణి వివాహితుడై, ముగ్గురు కుమారులు, కూతురితో రాజ్యాన్ని సుభిక్షంగా పాలించసాగాడు.

ధ్రువుడి సోదరుడు ఉత్తముడు వేటాడటానికి హిమవత్పర్వత ప్రాంతంలోని అడవికి వెళ్ళి అక్కడ ఒక యక్షుని చేతిలో నిహతుడైనాడు. అతని తల్లి సురుచి పుత్రశోకంతో అరణ్యానికి పయనమై అక్కడ కారుచిచ్చు మంటల్లో చిక్కి మరణించింది. తమ్ముడి మరణవార్త విని ధ్రువుడు దుఃఖావేశాలతో మంచుకొండల్లోని యక్షులపై యుద్ధానికి వెళ్ళాడు. భీకరమైన పోరుతో ఆ యక్షులను మట్టుపెట్టేందుకు నారాయణాస్త్రాన్ని ప్రయోగించాడు. అస్త్రం నుంచి ఉద్భవించిన వాడి బాణాలు ప్రత్యర్థులను క్రూరంగా సంహరించసాగాయి. ధ్రువుడి విజృంభణకు విస్తుపోయి, తాత స్వాయంభువ మనువు, ఋషులతో కలసి ప్రత్యక్షమయ్యాడు.

**హితవు చెప్పిన తాత...:** మనవడి ఆగ్రహాన్ని చూసి మనువు అచ్చెరువొంది 'ధ్రువకుమారా! మనుకులంలో పుట్టిన పుణ్యాత్ముడవు. ఒక్కని కోసం ఇంతమందిని వధించావు. ఇలాంటి విపరీత చర్య నీకు తగదు. శ్రీహరి భక్తులైన సజ్జనులకు పశువులా ప్రాణి హింసచేయడం సబబు కాదు' అంటూ **మహాత్ముల యందు దితిక్షయు, సములయందు మైత్రియు, హీనుల యందు కృపయు నితరంబులగు సమస్త జంతువులయందు సమత్వంబును కలిగి వర్తించు వాని యందు సర్వాత్మకుండైన భగవంతుడు ప్రసన్నుడగు...** "తనకంటే గొప్పవారి విషయంలో సహనభావం, తనతో సమానుల యందు స్నేహభావం, తనకంటే తక్కువ వారి యందు దయ, మిగిలిన సమస్త ప్రాణుల యందు సమభావం కలిగి ప్రవర్తించే వానిని సర్వాంతర్యామి అయిన భగవంతుడు కరుణిస్తాడ"ని హితవు పలికాడు.

మనువు మాటలపై గౌరవంతో ధ్రువుడు యుద్ధాన్ని విరమించి, రాజ్యానికి వెనుతిరిగాడు. గొప్పగొప్ప యజ్ఞాలతో పాటు భూరి దానాలు చేశాడు. ప్రజారంజకంగా రాజ్యాన్ని పాలించాడు. పుణ్యం కొద్దీ భోగాలు అనుభవించాడు. ఆ తరువాత కొడుకుకు రాజ్యపట్టం కట్టాడు. అనంతరం...

**మనునిభుఁ డంత భృత్యజనమంత్రి పురోహితబంధుమిత్ర నం**
**దన పశువిత్త రత్న వనితాగృహ రమ్యవిహారశైల వా**
**రినిధి పరీత భూతల హరిద్విప ముఖ్య పదార్థజాలముల్**
**ఘనమతిచే ననిత్యములుగాఁ దలపోసి విరక్తచిత్తుఁ డై**

–మనువుతో సమానుడైన ధ్రువుడు సేవకులూ, మంత్రులూ, పురోహితులూ, బంధుమిత్రులూ, సంతానమూ, పశువులూ, సిరిసంపదలూ, రత్నాలూ, స్త్రీలూ, గృహాలూ, క్రీడాపర్వతాలూ, విశాలమైన రాజ్యమూ, గుర్రాలూ, ఏనుగులూ తదితరమైనవన్నీ అనిత్యాలని బుద్ధికౌశలంతో భావించి విరక్తి చెందాడు. గృహస్థ ధర్మానికి ధ్రువుడు పరమ ఆదర్శం. రాజుగా ఎంత రాజసాన్ని అనుభవించాడో, ఋషిగా అంత వైరాగ్యాన్నీ అలవరచుకున్నాడు.

భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస ఇలాంటి వైరాగ్యాన్ని అలవరచుకోవాలనేవారు. ఇలాంటి వైరాగ్యానికి రాజర్షి అయిన జనక మహారాజును ఉదాహరణగా చూపుతూ... "ఘోరమైన సంసారదుఃఖాలు, తాత్కాలిక కష్టనష్టాల వల్ల విరక్తితో కలిగే మందవైరాగ్యం శాశ్వతమైంది కాదు. కానీ అందుబాటులో ఉన్నా ఐహికభోగభాగ్యాలు అశాశ్వతాలనీ, తుచ్ఛమైనవనీ గ్రహించడం చేత కలిగే తీవ్రవైరాగ్యం సర్వోత్తమమైంది" అనేవారు.

అలాగే స్వామి వివేకానంద కూడా ఒక్కరాత్రిలో సమస్త రాజ్యాన్నీ త్యజించిన గౌతమ బుద్ధుడిది మహోత్కృష్ట త్యాగమనేవారు. వైరాగ్యానికి పరాకాష్ఠగా శ్లాఘించేవారు. కానీ నేడు మనలో చాలామంది 'తలలు బోడులైన, తలపులు బోడులా!' అన్నట్లు మునిమనవళ్ళు పెళ్ళీడు కొచ్చినా,

భవబంధాలను వదులుకోవడానికి ససేమిరా అంటూంటారు. స్వచ్ఛందంగా మనంతట మనమే వాటిపై విరక్తి పెంచుకోగలిగితే ధ్రువుడిలా, జనకుడిలా, గౌతముడిలా మాననీయ స్థానంలో నిలబడగలం. సరోవరంలాంటి సంసారంలో ఎంత అనురక్తితో దిగుతారో, అంతే విరక్తితో వెనక్కి కూడా తిరగగలగాలి. అదే అసలైన ప్రజ్ఞ!

**దిగివచ్చిన దేవదూతలు...:** విరక్తుడైన ధ్రువుడు తన నగరాన్ని వదలి పుణ్యభూమి అయిన బదరికాశ్రమంలో అచంచలమైన భక్తితో పద్మనేత్రుడైన భగవంతుడిని ఆరాధించాడు. అప్పుడు ప్రకాశవంతమైన విమానం ఆకాశం నుంచి ధ్రువుని దగ్గరకు దిగి వచ్చింది. అందులోంచి మనోహరులైన ఇద్దరు విష్ణుకింకరులు ప్రత్యక్షమయ్యారు. వారిని చూసి, ఆ విష్ణుభక్తుడు, శ్రీమన్నారాయణ నామాలను స్మరిస్తూ నమస్కరించాడు.

అప్పుడు ఆ దేవదూతలు,... **నీదు పితరుల చేతను నన్యుల చేతను ననధిష్ఠితంబును, జగద్వంద్యంబును, నభక్త జనాతిదుర్జయంబును నయిన నట్టి విష్ణుపదంబుం పొందుదువు; రమ్మిదె విమానశ్రేష్ఠం; బుత్తమ శ్లోక జనమౌళియైన శ్రీహరి పుత్తెంచె...** "ఏ స్థానాన్ని పండితులు అన్నిటి కంటె శ్రేష్ఠమైనదని భావిస్తారో, సూర్యచంద్రులూ, గ్రహాలూ, నక్షత్రాలూ, తారాగణాలూ ఏ పదానికి ప్రదక్షిణం చేస్తూంటాయో; దేనిని మీ తాతతండ్రులూ, ఇతరులూ పొందలేకపోయారో, ఏది జగద్వంద్యమో, దేనిని భక్తులు కానివారు పొందలేరో – ఆ విష్ణుపదాన్ని నీవు పొందబోతున్నావు. రావయ్యా రా! ఇదిగో! ఈ విశేషమైన విమానాన్ని ఆ శ్రీహరి నీ కోసం పంపించాడ"ని వివరించారు. ఆ క్షణంలో...

**సురదుందుభి పణ వానక**
**మురజాదులు మొరసె విరుల ముసురు గురిసెఁ కి**
**న్నర గంధర్వుల పాటలు**
**భరితములై చెలఁగె నపుడు భవ్యచరిత్రా!...**

'దేవతలు నగారాలు, డోలులు, తప్పెటలు, మద్దెలలు మోగించారు. పూలవానలు కురిపించారు. కిన్నరలూ, గంధర్వులూ మంగళగీతాలు పాడారు. ధ్రువుడు దేవలోకానికి పయనమయ్యాడు'. ఆ సమయంలో ధ్రువుడు కన్నతల్లిని ఎలా విడిచిపోవడమా! అని విచారించాడు. కానీ విష్ణుభక్తులు అతనికి, ముందు విమానంలో పోతున్న సునీతిని చూపించారు. అప్పుడు ధ్రువుడు సంతసించాడు. భక్తుడి ఆత్మీయులపై కూడా భగవంతుడి కృపావృష్టి కురుస్తుందనడానికి ఇదే దృష్టాంతం.

పాండురంగడి పరమభక్తుడైన తుకారామ్‌ని కూడా శ్రీమహావిష్ణువు సశరీరంతో వైకుంఠానికి విమానంలో తీసుకువెళ్ళాడు. 1650లో ఫాల్గున కృష్ణ విదియ, గురువారం నాడు ఈ అద్భుత ఘట్టాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన భక్తులెందరో! స్వయంగా తుకారామ్ 'అదిగో గరుత్మంతుడు రెక్కలల్లారుస్తూ కనబడుతున్నాడు. నా కళ్ళలో కళ్ళుంచి చూస్తున్నాడు. భయపడకు, భయపడకని అంటున్నాడు. పచ్చని పట్టువస్త్రపు కాంతులు కనిపిస్తున్నాయి. ఈ పచ్చనికాంతి విశ్వమంతా వ్యాపించింది' అంటూ తన ఆఖరి అభంగంలో రాసుకున్నాడు. వైకుంఠానికి భార్యనూ రమ్మన్నాడు. కానీ ఆమె అదేదో పొరుగూరనుకొని భావించి, సగటు గృహిణిలా 'నేను మీతో వస్తే ఇంటి పనులు ఎవరు చేస్తారు' అంటూ నిరాకరించింది. అప్పుడు తుకారామ్ ఆమెతో 'భగవానుడు నిలబడి ఉన్నాడు. త్వరగా వెళ్ళాలి. సెలవు!' అని అంటూ వీడ్కోలు తీసుకున్నాడు. ఆ తరువాత చంద్రభాగ నదీతీరంలో నిలబడ్డ ఆ పరమభక్తుడి వద్దకు ప్రత్యక్షంగా విమానం రావడం, అతడు దానిని అధిరోహించడం, ఆకాశంలో కొంత దూరం పయనించడం, ఆ తరువాత అదృశ్యమవడం క్షణాల్లో జరిగిపోయాయి. ఆ అపురూప సన్నివేశాన్ని దర్శించిన భక్తులు ఆ నదీతీరంలోనే ఉండి అఖండ నామసంకీర్తన జరిపారు. తుకారామ్ వాయించే చిరుతలు, దర్భాసనం మూడు రోజుల తరువాత నేలపై పడ్డాయి. భక్త తుకారామ్ ఆ వైకుంఠ గమన దివసాన్ని నేటికీ మహారాష్ట్రులు పరమ పవిత్రంగా భావించి ఉత్సవాన్ని జరుపుతారు. భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస

> **ధ్రువుడు గృహస్థాశ్రమంలో, గృహస్థ ధర్మాన్ని ఎంత సమర్థంగా పోషించాడో, వానప్రస్థంలో విరాగిగా అంతే వైరాగ్యంతో భోగాల్ని త్యజించాడు. భగవంతుడే సర్వస్వమనుకొని ఆ దేవదేవుడిని ధ్యానించాడు. తుదకు శ్రీమహావిష్ణువు పంపిన విమానంలో సశరీరంగా వైకుంఠానికి తరలిపోయాడు.**

గృహస్థ భక్తుడైన బలరామ్ బసుకు కూడా ఇలాంటి భాగ్యమే కలిగింది. ఆయన అంతిమ క్షణాల్లో సాక్షాత్తూ శ్రీరామకృష్ణులే రథంపై వచ్చి వెంట తీసుకువెళ్ళారు. ఈ అపురూప ఘట్టానికి ఆయన అర్ధాంగే ప్రత్యక్ష సాక్షి. ఇలా భగవంతుడు ప్రియభక్తులకు తనే స్వయంగా పుణ్యలోకాలకు స్వాగతిస్తా డనడానికి నిదర్శనాలెన్నో!

**పుణ్యఫలశ్రుతి...:** భక్త ధ్రువుడి ఉపాఖ్యానాన్ని మిక్కిలి శ్రద్ధతో వినిపించినా, వినినా, పఠించినా ఆ సజ్జనులకు ఎంతో పుణ్యం దక్కుతుందని పరీక్షిత్తుకు శుకమహర్షి అభయమిస్తూ, **...సభల భక్తిని వినునట్టి సజ్జనులకు క్లేశనాశంబును మహాప్రకాశంబును నైన భగవద్భక్తియు శీలాది గుణంబులును కలుగు; మరియు తేజఃకామునకుఁ తేజంబును, మనఃకామునకు మనంబును, నిష్కామునకుఁ తత్త్వవిజ్ఞానంబును కలుగు; దీని వినిపించువారికి దేవతానుగ్రహంబు కలుగు..** అంటారు. ఆ మహర్షి మాట ప్రకారం నేటికీ శ్రీమద్భాగవతంలోని ఈ కథాకథనాల పారాయణంతో సమస్త కష్టాలు నశింపజేసుకుంటున్న, పరమ పవిత్రమైన భగవ ద్భక్తిని పెంచుకుంటున్న, సచ్ఛీలం అలవరచుకుంటున్న మహానుభావులెందరో! ❖

**ఎవడి వైరాగ్యం తీవ్రంగా ఉంటుందో అలాంటి వ్యక్తి తల్లి బిడ్డ కోసం పరితపించినట్లు భగవంతుడి కోసం పరితపిస్తాడు. అతడు భగవంతుణ్ణి తప్ప ఇతరమైనదేన్నీ కోరడు. - శ్రీరామకృష్ణులు**



స్వామి యతీశ్వరానంద

# మహాపురుషుని సాన్నిధ్య స్మృతులు

– ప్రవ్రాజిక శారదాప్రాణ

స్వామీజీ శిష్యురాలొకరు ఢిల్లీలో ఉన్నారు. ఆమె ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో కొన్నిరోజులు స్వామీజీ సాన్నిధ్యంలో గడపాలని బెంగుళూరు వస్తుండేవారు. 1965వ సంవత్సరం వేసవికాలం. ఆమె అప్పుడు పి.హెచ్.డి. చేస్తున్నారు. ఒకవైపు తన అధ్యయన నిమిత్తమై ఢిల్లీలోనే ఉండవలసిన అగత్యం, మరొకవైపు స్వామీజీ సాన్నిధ్యంలో గడపాలనే ఆరాటం – ఈ రెండింటి మధ్య చిక్కి తేల్చుకోలేక ఆమె స్వామీజీ అభిప్రాయాన్ని కోరారు. దానికి స్వామీజీ, "ఇప్పుడు రావలసిన అవసరం లేదు. నీ పరిశోధనా కార్యక్రమంపై మనస్సు సంపూర్ణంగా నిలపడమే నీ ప్రధాన కర్తవ్యం. నీవు ఇక్కడికి రావడం కన్నా ఢిల్లీలో ఉంటేనే నీకు ఎక్కువ పుణ్యమొస్తుంది. నా ఆశీర్వాదము కూడా లభిస్తుంది" అని వ్రాసారు. తన గురువుగారి ఆదేశాన్ని అక్షరాలా పాటించి ఆమె ఢిల్లీలోనే ఉండిపోయారు. కానీ తరువాత ఆమెకు స్వామీజీని స్థూలశరీరములో దర్శించే భాగ్యం కలుగలేదు. ఏడునెలల అనంతరం స్వామీజీ మహాసమాధి చెందారు. కానీ, గురువుగారి ఆదేశాన్ని పాలించి ఆయన యొక్క విశేషకృపకు పాత్రురాలై, ఆశీస్సులు పొందారు.

ఒకరోజు ఓ శిష్యురాలితో హఠాత్తుగా స్వామీజీ 'సేవచేయి' అన్నారు. అప్పటికింకా శిష్యురాలి మనస్సులో ఇతరులకు సేవ చేసే యోగ్యత తనకు రాలేదనే భావన ఉంది. అందువల్ల తన మనస్సులోని మాటను స్వామీజీకి ఈ విధంగా తెలియజేసింది: 'నాకు కొంత సమయం కావాలి. ఏకాంత వాసము చేసి ఇతరుల సేవ చేయడానికి మనస్సు సిద్ధపరచుకోవాలి. యోగ్యత సంపాదించి అప్పుడు సేవ చేస్తాను'.

ఆ మాటలు విని స్వామీజీ 'నీ మనస్సులో ఆ ఏకాంతవాసాన్ని సిద్ధపరచుకో! కర్తవ్యము మరియు ఉపాసన ఒకేసారి చేయాలి. మేము ఏమి చేస్తున్నామో చెప్పు. నేను కూడా రెండింటినీ సమన్వయము చేయడానికి ప్రయత్నిస్తు న్నాను' అన్నారు. మరొక సందర్భములో ఇలా చెప్పారు : అడవిలోగాని, ఆశ్రమాలలోగాని నివసిస్తూ మనము ఏకాంతవాసము చేస్తున్నామనుకోవడము సరికాదు. మనస్సులోకి ఈ జగత్తు అనే సంసారము వెళ్ళకుండా అడ్డుకోవడము అభ్యసించు.

మొదట్లో కర్తవ్యానికి, ఉపాసనకు మధ్య భేదమున్నదని పిస్తుంది. మెల్లమెల్లగా కర్తవ్యమే ఉపాసన అవుతుంది. సమగ్ర జీవనమే నిర్విరామమైన ఉపాసన మరియు ఆత్మనివేదనగా మారిపోతుంది. కర్తవ్యము మరియు ఉపాసన రెంటిని ఆచరించాలి. మనస్సును పవిత్రమొనరించుకుని, అంతర్ముఖ మైన దైవీభావమును వికాసము చేసుకో! కర్తవ్యము మరియు ఉపాసన (work & worship) ఆధ్యాత్మిక జీవనానికి రెండు అంగములు.

మానవులు చిన్న నీటి బొట్టంత ప్రేమను, ఆనందాన్ని ఇవ్వగలరు. దీనితో పోలిస్తే భగవంతుడు మహాసాగరమంతటి ప్రేమను, ఆనందాన్ని ప్రసాదిస్తాడు. కావున ఆయన వద్దకు వెళ్ళడమే మంచిది కదా!

సుఖసంతోషాలకై మనుష్యుల వెంట పాకులాడవద్దు. సాధారణంగా మనము చూసే ప్రేమ ఇచ్చిపుచ్చుకునే వ్యాపారం. లాభనష్టాల బేరీజు. నీకు ఇంత ప్రేమను పంచాను నాకేమిస్తావు అనే వ్యవహారము ఈ సామాన్యమైన ప్రేమ. సమస్త ప్రీతి వాత్సల్యములకు నిలయమైన భగవంతుణ్ణి ప్రార్థించు.

అందరి యెడల అనుకంపన కలిగివుండు. వ్యక్తిగత సంబంధాలను పోగొట్టుకోవద్దు. అలాగని ఏ ఒక్క వ్యక్తిగానీ, వస్తువుగానీ నీదని భావించి అధికారము చెలాయించవద్దు. అదే విధముగా నీపైన గానీ లేక నీ ప్రేమాభిమానముపైన గానీ యే ఇతర వ్యక్తి అధికారము చెలాయించునట్లు చేసుకోవద్దు.

బాహ్యావిషయాలపై ఆధారపడితే దుఃఖము కలిగి తీరుతుంది. కేవలము నీ మీద నీవు ఆధారపడడము ఆనందదాయకమైనది. మానవులను ఆశ్రయించడము ఒక పెద్ద బంధము. అందువల్ల నీలోనున్న సర్వాంతర్యామిని ఆశ్రయించు. ❖ **అనువాదం : శ్రీమతి టి. శారద**

(స్వామి యతీశ్వరానంద – శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులైన స్వామి బ్రహ్మానందజీ మహారాజ్ శిష్యులు)

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Sri+Ramakrishna+Prabha+March+2017**

* * *